సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో కార్పొరేటర్ ముప్పల లక్ష్మి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని సమస్యలపై అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్ హామీ ఇచ్చారు. శనివారం వార్డులో పర్యటించి ఆమె స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివాజీపాలెంలోని రఘురాం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సందర్శించి, దీపం 2 పథకం అర్హులందరికీ అందజేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆరిలోవ: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రాంతీయ నిఘా, అమలు శాఖ అధికారులు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ప్రతిభ చూపారు. విజిలెన్స్ విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పలు పాఠశాలల్లో పోటీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఆనందమార్గ్ ఆశ్రమ పిల్లలకు వితరణ



ఆశ్రమ పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న స్వామీజీ, దాతలు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పిల్లలకు శనివారం దాతలు అన్నదానం చేశారు. బాలుడు హరిచరణ్ జయంతి సందర్భంగా తల్లిదండ్రులు గణపతి, జ్యోతి ఆశ్రమ పిల్లలకు మధ్యాహ్న భోజనంతోపాటు పళ్లు, స్వీట్లు అందజేశారు. ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద్ అవధూత దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతగా 'స్వచ్ఛ భారత్'



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న ఐఏఎస్ఈ ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఐఏఎస్ఈ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ్ కుమారి, అధ్యాపక బృందం, విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. దీన్ని బాధ్యతగా తీసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు.

వాటర్ ట్యాంకు నీడలో శ్రమజీవులు



ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో చుట్టూ మొక్కలు పెంచి బారీ క్రేడ్ వేస్తున్నారు. మొక్కలు సంరక్షణ చేసే కూలీలు అక్కడి వాటర్ ట్యాంకు కింద ఇలా సేదా తీరారు. ఒక వైపు పనిచేస్తూ.. మరో వైపు ఎండకు కొద్దిసేపు విశ్రాంత తీసుకున్నారు. ఈ సేద తీరిన ప్రదేశం వాటర్ ట్యాంకు కిందకు రావడం పలువురిని ఆకర్షించింది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూ మైదానం అస్తవ్యస్తం



ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఇటీవల బాణసంచా సామగ్రి విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. దీపావళి వేడుకల అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని దుకాణదారులు అక్కడే వదిలిసి వెళ్లిపోయారు. శని, ఆదివారాలు సందడిగా ఉండే ఏయూ మైదానం చెత్తమయమై అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాంతం వారు ఆటలాడుకునేందుకు ఉన్న ఒకే ఒక్క మైదానం ఇది. ఈ గ్రౌండ్‌లో ఎక్కువ మంది యువకులు క్రికెట్ ఆడుతుంటారు. నగరంలోని యువకులే కాకుండా ఇతర ప్రాంతాలను వచ్చి ఇక్కడ మైదానంలో క్రికెట్, ఇతర ఆటలు ఆడుతున్నారు. అలాంటి ఈ మైదానం చెత్తాచెదారంతో నిండటం వల్ల నిరాశ చెందారు. శనివారం ఆట కోసం వచ్చిన అనేక మంది ఉసూరుమంటూ వెనుదిరిగారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కృష్ణా కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు పి.శ్రీనివాస్, సిహెచ్.లక్ష్మణరావు, కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' అనే నినాదంతో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 3 వరకు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు అవినీతి నిరోధక శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ అవినీతికి దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, ఉన్నత్ భారత్ అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతలతో ఉద్యోగావకాశాలు



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారా యువత భారీ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఐఈఈఈ ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, స్మార్ట్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్' అనే అంశంపై శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రానున్న కాలంలో 85 శాతానికి పైగా అప్లికేషన్లలో ఏఐ, ఎంఎల్ వంటి సాంకేతికతలను వినియోగిస్తారని వివరించారు. 160 దేశాల్లో 4.6 లక్షల మంది సభ్యులను కలిగి అతి పెద్ద సంస్థగా ఐఈఈఈ నిలుస్తోందని చెప్పారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ యువతను అత్యధికంగా కలిగిన దేశంగా భారత్ నిలుస్తోందన్నారు. శాస్త్రీయ ప్రగతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు నిలయాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్లు ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికతను ఎగుమతి చేసే దిశగా భారత్ అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సదస్సులో జనరల్ చైర్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, టీపీసీ చైర్ ఆచార్య దీపికారాణి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కార్తీక మాసోత్సవాలు



గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో అఖండ జ్యోతి వెలిగిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, స్థానికులు



విద్యుద్దీపాలంకరణలో పీతలవానిపాలెం శివాలయం

మద్దిలపాలెం: కార్తీక మాసోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేకువజాము నుంచి శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, దేవదాయ శాఖ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం, పీతలవానిపాలెం శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, దేవస్థానం సభ్యులు, కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం కార్యవర్గం, సభ్యులు స్థానిక భక్తులతో కలిసి అఖండ జ్యోతి వెలిగించి, కార్తీక మాసోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్య ప్రకాశ్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతిని గ్రామ సేవా సంఘం సభ్యులు వెలిగించారు. దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు మద్దాల వీరవెంకట అప్పారావు, ఎన్.నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆకాశదీపారాధనలు

ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీల్లోని శివాలయాల్లో కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం, కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, పాత వెంకోజీపాలెం సీతారామాలయంలోని ధ్వజ స్తంభాల వద్ద ఆకాశదీపాలు వెలిగించారు.

డిసెంబర్ 2 నుంచి కోటినారాయణ మహాయజ్ఞం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యనారాయణ తదితరులు

బీచ్‌రోడ్డు: లాసన్స్ బే కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబర్ 2 నుంచి జనవరి 1 వరకు కోటి నారాయణ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు భోగాపురపు సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహాయజ్ఞంలో భాగంగా ప్రతి రోజూ విశ్వక్షేన పూజ, గోపూజ, రక్షా సూత్రధారణ, రుత్విక్ వరుణ, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, మండపారాధనలు, అష్టగద్యలు, చతుర్వేద స్వస్తి, వేద ఆశీర్వచనం, తీర్థప్రసాద సమర్పణ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల బ్రోచర్‌ను అర్చకులు ఆవిష్కరించారు.

అవినీతికి దూరంగా యువత



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణ

విశాఖ సిటీ: అవినీతికి యువత దూరంగా ఉండాలని, తద్వారా దేశాభివృద్ధి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా శనివారం ఏయూ విద్యా విభాగంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని ప్రోత్సహించని వారు దేశభక్తులుగా నిలుస్తారన్నారు. నిజాయితీతో మెలిగే దేశం అన్ని రంగాల అభివృద్ధి సాధించడానికి మార్గం సుగమవుతుందని పేర్కొన్నారు. విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ భావితరానికి మార్గదర్శనం చేసే ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చే వారంతా నిజాయితీ, సచ్ఛీలతతో నడుచుకోవాలని సూచించారు. ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యుడు, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ చల్లా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతిపై పోరాటాన్ని ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మనిషికి వ్యాధి సంక్రమిస్తే ఎంతటి ప్రమాదమో, దేశంలో అవినీతి కూడా అంతే ప్రమాదమని చెప్పారు. కార్యక్రమంలో విద్యా విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్లతో స్థలం ఆక్రమణ



దారపాలెంలో ఆక్రమణకు గురైన స్థలం వద్ద బాధితుడు చంద్రరావు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలోని సర్వే నంబర్ 15/2, 15/3లో ఉన్న తనకు చెందిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారని తోట చంద్రరావు శనివారం మీడియాకు తెలిపారు. దారపాలానికి చెందిన ఆల్తి వెంకటరమణ, వరం, రౌతు గురుమూర్తి కలసి తనకు చెందిన సుమారు 1000 చదరపు గజాల స్థలంపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారన్నారు. 15/2, 15/3 సర్వే నంబర్లను మార్చేసి 15/1 వేసి తప్పుడు డాక్యుమెంట్లు చూపించి తన స్థలంలోని కొంత భాగానికి కంచె వేశారన్నారు. ఆ స్థలాన్ని విక్రయించకుండా తమకు ఆటంకం కలిగిస్తున్నారని వాపోయాడు. దీనిపై కొద్ది నెలల కిందట కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ వ్యవహారం కోర్టులో ఉండగా దీనిని పూర్తిగా ఆక్రమించడానికి మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ స్థలంలో విద్యుత్ శాఖ అధికారులు హెచ్‌డీ లైన్ వేయడంతో ఇది ప్రభుత్వానికి చెందిన స్థలమని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలంటున్నారు.

నిజాయితీగా రాణిస్తే దేశానికి మేలు



చార్టెడ్ అకౌంటెన్సీ విద్యార్థులతో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

మద్దిలపాలెం: ఉన్నత విలువలతో చార్టెడ్ అకౌంటెన్సీలో రాణించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆకాంక్షించారు. మద్దిలపాలెం ఐసీఏఐ భవన్‌లో చార్టెడ్ అకౌంటెన్సీ విద్యార్థులకు నిర్వహించిన రెండు రోజుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ముఖ్య అతిథి సీపీ జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. ఎంతో బాధ్యత గల చార్టెడ్ అకౌంటెట్లు నిజాయితీగా నిబద్ధతతో వృత్తిలో రాణిస్తే, దేశ అభ్యున్నతికి మేలు జరుగుతుందన్నారు. విద్యార్థి విభాగం చైర్మన్ లోకేశ్ ప్రసంగిస్తూ విద్యార్థులకు ముఖ్యంగా కఠోర శ్రమ, క్రమశిక్షణ, నిరంతర కృషి మాత్రమే గెలుపునిస్తాయని సూచించారు. సమావేశంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శనివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. స్కూల్ ప్రిన్సిపాల్ పి.అరుణ్ వివిధ మొక్కల గుణాలను వివరించారు. విద్యార్థులు సందడిగా పార్క్‌లో గడిపారు.

నేడు ఉచిత ఆయుర్వేద శిబిరం

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో ఆదివారం ఉదయం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో కేజీహెచ్ విశ్రాంత సీనియర్ వైద్యాధికారి ఎ.ఈశ్వరరావు రోగులను పరీక్షించి మందులు అందిస్తారన్నారు. దీర్ఘకాలిక సమస్యలున్న వారు గతంలో పరీక్షించిన రిపోర్టులు, వైద్యుల ప్రిస్క్రిప్షన్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94401 91373 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

డాబాగార్డెన్స్: ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల పరిరక్షణకు తీరని లోటని ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ బాబీ వర్ధన్ పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖ కమిటీ ఆధ్వర్యంలో శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రసార మాధ్యమాలు అదానీ, అంబానీ వంటి వారి చేతుల్లో నడుస్తున్నాయన్నారు. ప్రజలకు సాయిబాబా వంటి ప్రజా ఉద్యమాలకు నిలయమైన వ్యక్తులకు జరిగే నష్టాలు తెలియజేయడంలో ప్రసార మాధ్యమాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వ న్యాయవాద సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబాను ప్రత్యేక చీకటి గదిలో జైల్లో ఉంచి, ఆయనకు అందించాల్సిన హక్కులు కూడా ఇవ్వకుండా హరింపజేయడంలో రాజ్య హింస ప్రస్ఫుటమైందన్నారు. సీనియర్ న్యాయవాది వీవీ బాలకృష్ణ మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కులు కాపాడడంలో సాయిబాబా పాత్ర వేగుచుక్క వంటిదని కొనియాడారు. ఐలూ విశాఖ యూనిట్ అధ్యక్షుడు అల్లు సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐలూ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చాట ఆనందరెడ్డి, కేవై మణి, కోశాధికారి అప్పలరెడ్డి, పెద్ద ఎత్తున సీనియర్, జూనియర్ న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోవర్ధన పూజ



పిండివంటలతో గోవర్ధన గిరిని రూపొందించి అలంకరిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

ఆరిలోవ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో గోపూజ, గోవర్ధన పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో భక్తులు గోవర్ధన పూజ జరిపారు. శాకాహారంతో తయారు చేసిన రాగి లడ్డు, రాగి జంతికలు, కాజా, మైసూర్‌పాక్, అరిసెలు, గులాబీ రేకులు, జంతికలు, అటుకలు, రవ్వలడ్డు, చెకోడీలు, కొబ్బరి లడ్డూలు, పంచదార అరిసెలు, కోవా, నువ్వుండలు తదితర పిండి వంటలతోపాటు ఎండిన పండ్లు, నిమ్మరసం, పాలు, పెరుగుతో గోవర్ధన పర్వతం మాదిరిగా తయారు చేశారు. భక్తులు శ్రీకృష్ణుడికి దామోదర్ హారతి, నెయ్యి దీపాలతో పూజలు చేశారు. అనంతరం వీటిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ యదురాజా దాస భక్తులకు ఉపదేశించారు. గోపూజ, గోవర్ధన పూజ ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి వివరించారు. బృందావనంలో శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన గిరి పర్వతాన్ని చిటికిన వేలితో పైకెత్తిన రోజున భక్తులు స్వహస్తాలతో పలు రకాలైన తీపి పదార్థాలు తయారు చేసి గోవర్ధన గిరికి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సంప్రదాయాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ కొనసాగిస్తోందని ఆయన తెలిపారు.

అధ్వానం.. అవస్థలమయం

- ఈఎన్‌టీ ఆస్పత్రిలో మరుగుదొడ్ల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ఈఎన్‌టీ ఆస్పత్రిలో పనిచేయని వాష్ బేసిన్ నీటి కనక్షన్



నీటి సదుపాయం లేని మూత్ర విసర్జన బేసిన్



పాడైన టాయిలెట్ నీటి బేసిన్

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు ఈఎన్‌టీ ఆస్పత్రిలోని మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓపీ చూపించుకోవడానికి వచ్చే రోగులు వినియోగించే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ ఆస్పత్రి అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో రోగులు, వారితో వచ్చే బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల, మూత్ర విసర్జన చేసే బేసిన్లకు నీటి సదుపాయం లేకపోవటంతో రోగులు వాటిని వినియోగించేందుకు విముఖత చూపుతున్నారు. చేతులు శుభ్రం చేసుకునేందుకు వాష్ బేసిన్లు కూడా లేకపోవడం గమనార్హం. ఆస్పత్రిలోని మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేయడంతో రోగులు, వారి సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. ఈఎన్‌టీ ఆస్పత్రి ఉన్నతాధికారులు దృష్టి సారించి మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలని పేషెంట్లు, స్థానికులు కోరుతున్నారు.

జీర్ణక్రియ సమస్యలపై అప్రమత్తం

బీచ్‌రోడ్డు: దీపావళి పండగ సందర్భంగా వివిధ రకాల స్వీట్లు తినడం, టపాసులు కాల్చడం వల్ల జీర్ణక్రియ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని శ్రీవర్మ ఆయుర్వేద ఆస్పత్రి డైరెక్టర్ గౌతమ్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో సూచించారు. జీర్ణక్రియ సమస్యలను తగ్గించేందుకు శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపడంలో ప్రకృతి అనేక ఔషధాలను అందించిందన్నారు. పొడవాటి మిరియాలు, ఓమ, బెల్లం, తేనే మిశ్రమంతో లేహ్యం చేసుకొని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి అంటువ్యాధులు రాకుండా నివారిస్తాయని చెప్పారు.